ప్రజాశక్తి

మంగళవారం 22 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

పోర్టు వాటర్ వరల్డ్‌లో...

బాలుడి మృతిపై విచారణ ఎక్కడ?

- సేఫ్టీ ఆడిట్ లేదు.. పిపిపి ఒప్పందంపై ఆరాలేదు
- పోర్టు కళావాణిలో ఆగని 'ప్రయివేటు' ఆటలు
- చోద్యం చూస్తోన్న 'కూటమి' పాలకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఏదైనా ప్రమాదం జరిగితే అధికారులు, రాజకీయ నాయకులు చేసే హడావుడి, అట్టహాసం గురించి తెలిసిందే. తర్వాత ఎక్కడివారక్కడ గప్పుచుప్ అయిపోవడం ఆనవాయితీ. విశాఖలోనూ, ఉమ్మడి జిల్లాలోనూ అనేక ఉదంతాలను ఇలా చెప్పుకోవచ్చు. ఏప్రిల్ 7వ తేదీన విశాఖ నగరంలోని విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిఎ)కు చెందిన పోర్టు ఆడిటోరియం (కళావాణి)లోని స్విమ్మింగ్‌పూల్‌లో మురళీనగర్‌కు చెందిన ఏడేళ్ల బాలుడు రిషి స్విమ్మింగ్‌కు దిగి ఊపిరాడక మృతిచెందిన ఘటన యావత్ విశాఖ నగరాన్ని కలచివేసింది. ఈ దుర్ఘటన పాత ఘటనల ఖాతాలోనే జమ అయిపోయిందా? అంటే అవుననే సమాధానం సర్వత్రా వినిపిస్తోంది. వెనువెంటనే టిడిపి, జనసేన, బిజెపి నేతలంతా దీనిపై సిఐడి విచారణ జరగాలంటూ పెద్ద ఎత్తున గళాలెత్తారు. పోర్టు ఉన్నతాధికారులు పిపిపిలో ఈ కళావాణి ఆడిటోరియంలోని ఇండోర్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌ను విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వహణకు పిపిపిలో లీజుకు ఇచ్చారు. సదరు కాంట్రాక్టర్ల నిర్వహణా లోపాన్ని బాలుడి మృతి ఘటన పట్టిచూపుతోంది. ఘటన జరిగి సుమారు 15 రోజులు కావస్తున్నా దీనిపై సరైన విచారణ ఏమీ జరిగినట్లు కనిపించడం లేదు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వెంటనే విచారణకు ఆదేశించారు.

తూతూ మంత్రం తనిఖీలకే పరిమితమా?

టూరిజం అధికారులు తనిఖీలు చేశారు. ఇక్కడ నిర్వహిస్తున్న వాటర్ వరల్డ్‌ను కూడా నగర పోలీస్ కమిషనర్ మూయించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా మొత్తంగా పోర్టు పిపిపి ఒప్పందాలపై ఉన్నత స్థాయిలో దర్యాప్తు ఎందుకు సాగడం లేదన్నది ప్రశ్న. అమ్యూజ్‌మెంట్ పార్కులు, స్నో పార్కులు పేరుతో పోర్టు ఆడిటోరియంలో నిర్వహిస్తూ మొత్తం పోర్టు కళావాణిని వ్యాపారమయంగా సదరు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వహకుడు మార్చేశాడన్నది సర్వత్రా వినిపిస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలకూ పోర్టు యాజమాన్యం ముందుకెళ్లలేదు. జిల్లా కలెక్టర్ విచారణ ఎంతవరకూ వచ్చిందో బయటకు రానివ్వని పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు (బిజెపి) పరిధిలోకి వచ్చే ఈ పోర్టు ఆడిటోరియం వ్యవహారంపైనా, బాలుడి మృతి ఘటన జరిగిన తర్వాత పెద్ద ఎత్తున స్పందించి తర్వాత నీరసించిపోయారన్న విమర్శలు స్థానికుల నుంచీ వినిపిస్తున్నాయి. బొడ్డేటి కాశీ విశ్వనాథ్ నిర్వహణ కిందకు పూర్తిగా పోర్టు ఆడిటోరియం స్థలాలన్నీ నడుస్తూ వ్యాపార ప్రాంగణంగా పోర్టు కళావాణి మారిపోయినా స్థానిక ప్రజాప్రతినిధికి పట్టడం లేదు. స్విమ్మింగ్ పూల్ మాత్రమే మూయించేసి విమర్శలను ఆపుకునే ప్రయత్నాలు చేశారు. మిగతా కార్యకలాపాలన్నీ పోర్టు ఆడిటోరియంలో ప్రయివేటు నిర్వహణలో సాగిపోతున్నాయి. ఇలా మొత్తంగా పోర్టు ఆడిటోరియం, కళావాణి వేదికలు, ప్రాంగణాలు లీజుల పేరుతో ప్రయివేటు పరం అయిపోయి వ్యాపారాలకు అడ్డాగా మారిపోయిందన్న విషయంపై అధికార కూటమి పార్టీలకు చెందిన నేతల నుంచి చర్యల దిశగా లేదంటే సరైన విచారణ జరిగే పరిస్థితి ఇంతవరకూ లేదు.

ప్రయివేటుకిచ్చేశాం అన్న ధోరణిలో పోర్టు

పోర్టు కళావాణిలో స్థలాలను పిపిపి లీజులు

మిగతా 2లో..

నేడు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస బలపరీక్ష

17 మంది కౌన్సిలర్లు హాజరు తప్పనిసరి

డుమ్మా కొట్టించేందుకు క్యాంపు రాజకీయం

మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై వైసిపి కౌన్సిలర్లు సమర్పించిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసినట్లు కమిషనర్ ప్రసాదరాజు సోమవారం ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయంలో నర్సీపట్నం ఆర్‌డిఒ వివి.రమణ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతుందని చెప్పారు.

వైసిపి తరుపున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పిళ్లా రమాకుమారి రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొద్ది నెలల క్రితం బిజెపిలో చేరారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి రాజు నేతృత్వంలో వైసిపి కౌన్సిలర్లు సమావేశమై మున్సిపల్ చైర్‌పర్సన్‌పై మార్చి 26వ తేదీన 18 మంది వైసిపి కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు అందజేశారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్, నర్సీపట్నం ఆర్‌డిఒ వివి.రమణను ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ ఏప్రిల్ 22వ తేదీన సమవేశం నిర్వహించి బలాబలాలు తేల్చాలని ఉత్తర్వులిచ్చారు. ఈ సమావేశంలో జరగాలంటే 17 మంది సభ్యులు హాజరు తప్పనిసరి. అయితే మెజార్టీ సభ్యులు సమావేశానికి డుమ్మా కొట్టించి అవిశ్వాసం వీగిపోయేటట్లు చేయడానికి చైర్‌పర్సన్ వర్గీయులు క్యాంపు రాజకీయాలు నిర్వహించారు. దీంతో కోరానికి సరిపడా 17 మంది కౌన్సిలర్లు హాజరయ్యే అవకాశం లేదని కూటమి నేతలు ధీమాగా ఉన్నారు.

ఈ నేపథ్యంలో 7వ వార్డు కౌన్సిలర్ కట్టమూరు సుజాతను ప్రజాశక్తి ఫోన్‌లో పలకరించగా తాను క్యాంపుకు వెళ్లలేదని చెప్పారు. చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేస్తారా అని ప్రశ్నిస్తే జవాబివ్వకుండా ఫోన్ పెట్టేశారు. అధిక శాతం మంది వైసిపి కౌన్సిలర్లు డబ్బుకు అమ్ముడు పోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసుపై జరుగు సమావేశం కోరం లేకండా వీగిపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

వైద్య విద్య వ్యాపారంగా మారడమే అభివృద్ధికి ఆటంకం

▶ వార్త మెయిన్ 2లో..

'లిటిల్ ఏంజెల్'లో తొలగించిన కార్మికులను తీసుకోవాలి

▶ వార్త 2లో..

పోర్టులో బయోమెట్రిక్

సకాలంలో రాకపోతే ఆర్థిక కోతల విధానం

▶ వార్త 8లో..

ములగాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పేద ప్రజలు

అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలి

▶ వార్త 4లో..

బిందెడు నీటికి బోలెడు కష్టం

తమ్మయ్యపేటలో కుళాయి నీటికి క్యూకట్టిన మహిళలు

-బోర్లలో ఉప్పునీరు

-పూర్తిచేయని జలజీవన్ మిషన్ పనులు

-వీధుల్లో పైపులకే పరిమితం

-కలెక్టర్ మాట బేఖాతరు

-హోంశాఖమంత్రి అనిత నియోజకవర్గంలో తాగునీటి తిప్పలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, సరఫరాలో ఇబ్బందులు వస్తే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని, ప్రతి కుటుంబానికి రక్షిత మంచినీరు అందించాలని, కలెక్టర్ విజయకృష్ణన్ ఈ నెల 3వ తేదీన నిర్వహించిన సమీక్షలో గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలు కొత్తకాదనుకున్నారో, తాగునీటి సమస్యలు పాతవేననుకున్నారోగానీ గ్రామీణ నీటి సరఫరా అధికారులు చలించడం లేదు. ఈ సమస్యలూ రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత ప్రాతినిధ్యపు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. జిల్లాలో పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం చందనాడ పంచాయతీ తుమ్మలపేట, తమ్మయ్యపేట, అమలాపురం పంచాయతీలోని మూలపర్ర, డిఎల్.పురం పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎంతోకాలంగా తుమ్మలపేటలో తాగునీటి సమస్య ఉందని మహిళలు ప్రజాశక్తికి

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పోర్టు 'వాటర్ వరల్డ్'లో...

బాలుడి మృతిపై విచారణ ఎక్కడ?

ప్రయివేటు నిర్వహణకు ఇచ్చేశాం, మా బాధ్యత లేదన్న రీతిలో పోర్టు ఉన్నతాధికారుల వ్యవహారం కనిపిస్తోంది. వాస్తవానికి పోర్టు ట్రస్ట్ అథారిటీ ఛైర్మన్ ఎం.అంగముత్తుకు ఇక్కడ జరుగుతున్న కార్యకలాపాల వ్యవహారాలు తెలియవా? అనే ప్రశ్న పలువురి నుంచి వినిపిస్తోంది. ఒక వారంలో ఛైర్మన్ పోర్టుకు వచ్చేది ఒకటి రెండు రోజులు మాత్రమే కావడంతో ఆయనకు ఈ వ్యవహారాలేవీ తెలియవన్న చర్చ కూడా సాగుతోంది.

బిందెడు నీటికి బోలెడు కష్టం

తెలిపారు. రామచంద్రాపురం నుంచి నీరు సరిగా సరఫరాచేయక కొబ్బరితోటలోని బావుల నుంచి, నడిచి వెళ్లలేనివారు ఊర్లో మోటారు ఉన్న ఇళ్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నట్లు మాడుగుల రమణమ్మ తెలిపారు. చేతి బోర్ల నీరు పెద్దగా రావడంలేదు. జలజీవన్ మిషన్ కింద పైపులు వేస్తున్నపుడు దెబ్బతిన్న కుళాయి లైన్లను బాగుచేయలేదని గ్రామస్తులు చెప్పారు. జలజీవన్ మిషన్ కింద తవ్విన గోతులు కప్పలేదని తన ఇంటి బయట కర్రకు కట్టిన కుళాయి పైపును అమలకంటి నాగమణి చూపించారు. జలజీవన్ పనులు పూర్తిచేసి నీరు సరఫరా చేస్తే మాకీ తాగునీటి సమస్య తీరేదని గ్రామస్తులు అంటున్నారు. తమ్మయ్యపేటలో రెండ్రోజులకు ఒకసారి అరగంట పాటు కుళాయి నీరు ఇస్తున్నారని, అది కూడా ఏ సమయంలో వస్తుందో తెలీక బిందెలు పెట్టుకొని చూస్తున్నామని గొల్లపల్లి వరలక్ష్మి తెలిపారు. ఉన్న బోర్లలో ఉప్పునీరు వస్తోంది. జలజీవన్ మిషన్ కింద పైపులు వేసి ఆపేశారు. దాదాపు 150 కుటుంబాలున్న ఈ ఊర్లోని వీధి కుళాయిలకు ఒక లైన్‌లో నీరు వస్తే మరొక లైన్లో నీరు రాక, నీరు వచ్చిన చోట బిందెలు వరుసగా పెట్టుకొని నీరు పట్టుకుంటున్నారు.

మూలపర్రలో సుమారు 200 కుటుంబాలు మంచినీటికి అవస్థలుపడుతున్నాయి. బోర్లు నుంచి వచ్చే ఉప్పు నీరు వాడుకకు ఉపయోగిస్తున్నారు. అమలాపురం సమీపంలోని బోరు నీటిని టూ వీలర్‌పై మగవాళ్లు వెళ్లి చిన్నపాటి డ్రమ్ములతో తెస్తున్నారని సూరకాసుల ఆనంతలక్ష్మి చెప్పారు. డిఎల్.పురంలో జలజీవన్ మిషన్ కింద కొన్ని వీధుల్లో పైపులు వేసినా కుళాయిలు అమర్చి నీరు సరఫరా చేసేపని పూర్తిచేయలేదు. ఇక్కడ కూడా బోర్లలో నీరు తాగడానికి పనికిరావడంలేదు. కుళాయి నీరు రెండు, మూడు రోజులకు వస్తోందని గొల్లవీధికి చెందిన నకిలి దేవి తెలిపారు. ఒకటి, రెండు బిందెల నీరు పట్టేలోపు కుళాయి నీరు ఆగిపోతుందని కుండల అప్పలనర్స తెలిపారు. నీళ్లకు చాలా ఇబ్బందిపడుతున్నామని మహిళలు తెలిపారు. ఈ గ్రామాల్లో నీటి సమస్యలేదని, కొద్ది రోజుల క్రితం బోర్లు వేశామని నక్కపల్లి డివిజన్ గ్రామీణ నీటి సరఫరా విభాగ డిఇ ఆనంద్ తెలిపారు.

హైయర్ గ్రావిటీ సిరీస్ ఏసీలు విడుదల

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : హైయర్ అప్లయన్సెస్ ఇండియా గ్రావిటీ సిరీస్ ఎయిర్ కండిషనర్లను సోమవారం విశాఖలో ఆవిష్కరించింది. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హైయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్ఎస్.సతీష్ మాట్లాడుతూ, ఈ నూతన ఏసీలు ఫ్యాబ్రిక్ ఫినిష్‌తో నూతన ఎఐ క్లైమెట్ కంట్రోల్ వ్యవస్థతో కూడి ఉందని తెలిపారు. ఈ గ్రావిటీ సిరీస్ ఏసీలు మార్నింగ్ మిస్ట్, మూన్ స్టోన్ గ్రే, మిడ్నైట్ డ్రీమ్, గెలాక్సీ స్లేట్, ఆక్వా బ్లూ, కాటన్ క్యాండీ, వైట్ రంగుల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి ఎఐ ఎలక్ట్రిసిటీ మానిటరింగ్ విద్యుత్ వినియోగాన్ని నిజ సమయంలో ట్రాక్ చేస్తూ విద్యుత్ బిల్లు నియంత్రణలో సాయపడుతుందని వివరించారు. ఇవి క్లౌడ్-ఆధారిత సర్వర్, అధునాతన ఎఐ - ఎకో కార్యాచరణతో కూడిన శక్తితో వృథాను తగ్గిస్తుందని తెలిపారు.

పల్లాకు అధికార మదం : బివి.రామ్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధికార మదంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. ఎంవిపి.కాలనీలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసం ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పల్లా శ్రీనివాసరావు విషయమై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో చర్చించానని తెలిపారు. వైసిపి అరాచక పాలనలో ప్రజల పక్షాన పోరాటం చేసిన తాను ఇప్పుడు కూడా అదే పోరాట మార్గంలో ప్రయాణం చేస్తున్నానని తెలిపారు. తన పోరాట పటిమ రుచించని పల్లా శ్రీనివాసరావు తన పట్ల అవమానకరంగా వ్యవహరించారని పేర్కొన్నారు. చంద్రబాబుతో తన సాన్నిహిత్యాన్ని తట్టుకోలేక పల్లా రగిలిపోతున్నారని ఆరోపించారు. తన పట్ల అవమానకరంగా మాట్లాడిన పల్లా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పల్లా యథేచ్ఛగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

'లిటిల్ ఏంజెల్'లో తొలగించిన కార్మికులను తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని లిటిల్ ఏంజెల్ స్కూలులో అకారణంగా తొలగించిన కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రయివేటు కాలేజెస్ అండ్ స్కూల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన తొలగించబడ్డ కార్మికులు మెడకు ఉరి వేసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ, లిటిల్ ఏంజెల్స్ స్కూలులో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా అక్రమంగా తొలగించారన్నారు. లిటిల్ ఏంజెల్స్ యజమాన్యం లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించి 15 మందిని తొలగించిందని, లేబర్ కార్యాలయ అధికారులు జోక్యం చేసుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 15 మంది కార్మికులను ఉద్యోగాల నుంచి అక్రమంగా తొలగించడమే కాకుండా వారికి గ్రాట్యుటీ ఇతర బెనిఫిట్స్ చెల్లించకుండా సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తున్నారని తెలిపారు. యాజమాన్యం దుర్మార్గానికి వ్యతిరేకంగా కార్మికులు ఆందోళన చేస్తుంటే వారి మీద పోలీసులను ఉపయోగించి తప్పుడు ఫిర్యాదు ఇచ్చి ఒత్తిడికి గురిచేస్తోందని ఆరోపించారు. చౌకబారు ఎత్తుగడలతో యాజమాన్యం కార్మికులను అణిచివేయాలనే ఆలోచన మానుకోవాలన్నారు. యాజమాన్యం అక్రమంగా తొలగించిన ముగ్గురు డ్రైవర్లను ఉద్యోగంలో పెట్టుకోవాలని, లేదా చట్ట ప్రకారం వారికి గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించే 12 మందికి అన్ని బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, కార్మికులకు వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. వేసవి సెలవులకు సంబంధించి, లీవ్ వేజెస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, కార్మికులు ఎస్ఎన్.రావు, ఎం.నాగరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మెడకు ఉరి వేసుకుని వినూత్నంగా నిరసన

మెడకు ఉరి వేసుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి చీఫ్ సిటీ ప్లానింగ్ అధికారి ప్రభాకర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారుని దరఖాస్తు ముగింపు చేసే ముందు జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీ పునరావతం అయితే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

డి డెక్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎకు చెందిన డి డెక్ (మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాంగణం), యు హెక్ 3 హెచ్ (హెలికాప్టర్ మ్యూజియం) లను విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ సోమవారం సందర్శించారు. త్వరలో ముఖ్య మంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి పలు సూచనలు చేశారు. మిగిలిన పనులు ఏమైనా ఉంటే ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, పర్యవేక్షక ఇంజినీర్లు భవానీశంకర్, బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు మధుసూదన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుదీర్, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాపారాలకు రుణాలివ్వాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మార్కెట్ అవసరాలు, డిమాండు ఉన్న వ్యాపారాలకు, అభ్యర్థుల ఆసక్తికి అనుగుణంగా ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు మంజూరుకు జిఒలో మార్పులు తేవాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొన్ని సవరణలు సూచిస్తూ ముఖ్యమంత్రికి రాసిన వినతిపత్రాన్ని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్దేశించిన షాపులకు మాత్రమే రుణాలు ఇస్తే వ్యాపారం సాగక సబ్సిడీ దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు. మారుతున్న వ్యాపార మార్గాలు, యువత వ్యాపార అభిరుచికి అనువైన పథకాలను రుణ జాబితాలో చేర్చాలని కోరారు. లోన్ల జాబితాలో ఉన్నత చదువులు కలిగిన వారిని స్వయం ఉపాధి వైపు మళ్లించి స్వశక్తి తో నిలదొక్కుకునేలా టెంట్ హౌస్, ఎల్ఇడి స్క్రీన్ సప్లై, ఆక్వా కల్చర్ మిషనరీలు, ట్రాక్టరు, వరి సాగు ఆటోమేటిక్ యంత్రాలు (వరి కోత, నాట్లు, కలుపు తీత మిషన్లు), కోళ్లు, గొర్రెలు, మేకల ఫారం, డెంటల్ ల్యాబ్, కంటి ల్యాబ్ యంత్రాలు, వీధుల్లో పండ్లు, కూరగాయలు అమ్మే మహిళలను ప్రోత్సహించాలని కోరారు. ఫ్యాన్సీ, జనరల్ స్టోర్, జెరాక్స్, మెడికల్ షాపులకు కూడా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విదసం సహాయ కన్వీనర్ జాజి ఓంకార్, నాయకులు సొడదాసి సుధాకర్, డి.నిర్మల, కస్తూరి వెంకటరావు, బొడ్డు కృష్ణ, మణి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఆర్ఐ కాలేజీపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైద్య విద్యార్థి ప్రణీత్ ఆత్మహత్యకు కారణమైన తగరపువలసలోని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎబివిపి ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కెజిహెచ్‌కు వైద్య పరికరాలు వితరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ న్యూరో సర్జరీ విభాగంలో వినియోగం కోసం రూ.8 లక్షల విలువైన వైద్య పరికరాలను కీర్తిశేషులు డాక్టర్ సుంకర బాల పరమేశ్వరరావు (న్యూరో సర్జన్) కుమార్తె సుంకర ఆదిలక్ష్మి, కోడలు సుబ్బలక్ష్మి, మనవాళ్లుడాక్టర్ ఎస్‌జె.బాలపరమేశ్వరరావు (న్యూరో సర్జన్) సుంకర రాజగోపాల్ (ఐఎఎస్) సోమవారం అందజేశారు. వీటిని కెజెహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కెజిహెచ్‌లోని న్యూరో సర్జరీ విభాగానికి ప్రముఖ న్యూరో సర్జన్ కీర్తిశేషులు డాక్టర్ సుంకర బాలపరమేశ్వరావు న్యూరో సర్జరీ వార్డుగా నామకరణం చేసినట్లు తెలిపారు. ఆయన జ్ఞాపకార్థం న్యూరో సర్జరీ విభాగానికి వైద్య పరికరాలను డాక్టర్ సుంకర బాలపరమేశ్వరరావు కుటుంబ సభ్యులు విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ్‌జిత్‌రే తో పాటు, ఇతర న్యూరో సర్జరీ వైద్యులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S. No. 49/2023

Between :
బాదం సత్యనారాయణ ...వాది
మరియు
బాదం క్రాంతి కుమార్ సుబ్బారావు శ్రేష్టి వగైరాలు ...ప్రతివాదులు

ప్రతివాదులు:
16) వరిగల సుబ్రహ్మణ్యం గుప్త, తండ్రి సూర్యనారాయణ మూర్తి, వ్యాపారం, డో.నెం. 33-14-37, అల్లిపురం, విశాఖపట్నం.
17) వరిగల వెంకట రమణ మల్లికార్జున గుప్త, తండ్రి సూర్యనారాయణ మూర్తి, వ్యాపారం, డో.నెం. 33-14-37, అల్లిపురం, విశాఖపట్నం.
18) నారాయణం సుబ్బలక్ష్మి, భర్త జగన్నాధరావు, గృహిణి, డో.నెం. 33-14-37, అల్లిపురం, విశాఖపట్నం.
19) ప్రత్తి ఉదయ్ కుమార్, తండ్రి సుబ్రహ్మణ్యం, వ్యాపారం, 5వ అంతస్తు, వ్యాస్ టవర్స్, సమతా నగర్, గాజువాక, విశాఖపట్నం.
20) ప్రత్తి సునీత, తండ్రి సుబ్రహ్మణ్యం, సాఫ్ట్ వేర్ కన్సల్టెంట్, 5వ అంతస్తు, వ్యాస్ టవర్స్, సమతా నగర్, గాజువాక, విశాఖపట్నం.
21) ప్రత్తి సునందా, తండ్రి సుబ్రహ్మణ్యం, సాఫ్ట్ వేర్ కన్సల్టెంట్, 5వ అంతస్తు, వ్యాస్ టవర్స్, సమతా నగర్, గాజువాక, విశాఖపట్నం.

కోర్టు వారి ఆర్డరుపై తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తమై నోటీసులు పంపుతుండగా మీరు అందుకోకుండా ఉన్నందున, ఇందుమూలముగా తెలియచేయునదేమనగా పై నెంబరు వ్యాజ్యము వాయిదా **ది. 28-04-2025న** ఉన్నందున, సదరు తేదీన పై కోర్టువారి ఎదుట మీరు **ఉదయంగం. 10-30 ని॥లకు** స్వయంగా కాని, అడ్వకేట్ ద్వారా గానీ హాజరు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని గ్రహించగలరు.

కొత్త మాణిక్యాలరావు, న్యాయవాది
అన్నపూర్ణ థియేటర్ వెనుక, కుంతి మాధవనగర్, పిఠాపురం
పిఠాపురం.
ది.21-04-2025

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.A.666/2023 in O.S.242/2017

Between:
Visakhapatnam Metropolitan Region Development Authority,
Rep. by its Estate Officer,
Visakhapatnam ...Petitioner/Plaintiff
And:
Gaddipilli Jampayya & others
...Respondents/Defendants

NOTICE

To,
R-3: Moturi Madhavi,
W/o. Venkata Ravi Chandra,
R/at D.No. 49-55-8,
Vudyuth Nagar, Visakhapatnam

Please take notice that the above named petitioner/plaintiff filed a suit for cancellation of Regd. Sale Deeds against the defendants in the above suit. The above suit is dismissed for default on 01-04-2022 on that the petitioner/plaintiff filed a petition under Order 9 rule 9 of C.P.C. in the above suit before this Hon'ble Court. The Hon'ble Court order notice to you in the above I.A.666/2023 by way of this paper publication and the matter stands posted to **02-05-2025** for your appearance on that day at **10:30 A.M** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, exparte as per law.

JANNELA SRINIVASA RAO,
Advocate, Visakhapatnam.
Cell: 9848561176

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT: GAJUWAKA
O.S.70/2022

Between:
Sri Rachaprolu Suresh Kumar
...Plaintiff
And:
Smt. Satti Lakshmi Kumari
...Defendant

SUMMONS

To, **The Defendant:**
Smt. Satti Lakshmi Kumari,
W/o. S.L.B. Reddy, Hindu,
aged about 68 years,
R/at Flat No.61, MVP Colony,
Visakhapatnam-530013.

Please take summons that the above named plaintiff has instituted the above suit against the defendant for recovery of amount due under the promissory note and for other reliefs and the same stands posted to **29-04-2025** for your appearance on that day at **10:30 A.M**. You should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, exparte.

(By Order of the Hon'ble Court)
NALI SESHU KUMAR,
Advocate for Plaintiff
Visakhapatnam,
Cell:9347379739.
VSP
Dt. 17-04-2025

గుట్టుగా స్టీల్‌ప్లాంట్ భూమి కబ్జా!

• ఆవుల షెడ్ పేరుతో ఆక్రమణ, తర్వాత అమ్మకం • చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి -గాజువాక : ఆవుల షెడ్డు పేరుతో స్టీల్‌ప్లాంట్ భూమిని గుట్టుగా కబ్జా చేసిన బాగోతం జివిఎంసి 76వ వార్డు పెదగంట్యాడ బాల చెరువు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలివి.

ఆవులను కట్టేందుకని ముందుగా దడి కట్టి, తర్వాత పందిరి వేసి కొన్నాళ్లకు షెడ్‌ను నిర్మించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూమిని ఒక వ్యక్తి దర్జాగా కబ్జా చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి. అనధికారికంగా నిర్మించిన షెడ్‌కు తర్వాత కరెంట్ మీటరు, ఏకంగా పత్రాలు సృష్టించారు. వాస్తవానికి. స్టీల్ ప్లాంట్ లేఅవుట్‌లో రోడ్డుగా ఉన్న ఈ స్థలం కొన్నేళ్లుగా ఆక్రమణలో ఉంది. ఈ షెడ్‌పై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి. గతంలో సర్వేయర్ సింహాచలం ఈ ఆవుల షెడ్ ఆక్రమణలో ఉందని గుర్తించి తొలగించారు.

ప్రస్తుతం ఈ ప్రాంతంలో స్థలాల ధరలు లక్షల్లో ఉండడంతో, సంబంధిత అధికారులను ప్రలోభపెట్టి, ముందుగా కబ్జా, తర్వాత దర్జాగా ఈ స్థలాన్ని అమ్మకానికి సిద్ధపడుతున్నారు. గతంలో ఈ స్థలంపై అనేక ఫిర్యాదులు వెళ్లినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో సంబంధిత వ్యక్తి నిర్వాసిత

స్టీల్‌ప్లాంట్ స్థలంలో నిర్మించిన పశువుల పాక

కాలనీలో అనేక స్థలాలను ఆక్రమించి అమ్ముకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు కాపాడవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం ఆక్రమణదారులకు మద్దతు తెలిపినట్లేనని ఉక్కు నిర్వాసితుల సంఘాల నాయకులు మండిపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అంటున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమణల నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎస్‌డిసి సునీత వివరణ కోరగా, స్టీల్‌ప్లాంట్ భూములు ఆక్రమణకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై కూడా దర్యాప్తు చేస్తామని తెలిపారు.

12 మోడల్ ప్రాథమిక పాఠశాలలు మంజూరు

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి, మెరుగైన విద్యాభివృద్ధి లక్ష్యంతో పద్మనాభం మండలంలో 12 ప్రాథమిక మోడల్ స్కూళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంఇఒ టి.రమణ తెలిపారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగింపుతో పాటు తరగతికి ఒకరు చొప్పున పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉంటారన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యను బట్టి మండలంలో మోడల్ స్కూళ్ల ఎంపిక జరిగిందన్నారు. కృష్ణాపురం, పద్మనాభం, రేవిడి, పాండ్రంగి, మద్ది, అనంతవరం, కె.కోవ్వాడ, గంధవరం, పొట్నూరు, రెడ్డిపల్లి, చిన్నాపురం, బిఆర్ తాళ్లవలస. గ్రామాల్లో ఉన్న పాఠశాలను మోడల్ ఎలిమెంటరీ స్కూళ్లగా ఎంపిక చేశారన్నారు. దీనివల్ల పద్మనాభం మండలానికి అదనంగా 16 పోస్టులు మంజూరైనట్లు తెలిపారు

కోరాడ కుటుంబాన్ని పరామర్శించిన బొత్స

కోరాడ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన బొత్స

ప్రజాశక్తి- ఆనందపురం : ఇటీవల మృతి చెందిన వేములవలస మాజీ సర్పంచ్ కోరాడ నాగభూషణరావు కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి, శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జెడ్‌పిటిసి కోరాడ వెంకట్రావు, చందక పంచాయతీ సర్పంచ్ బంక శ్రీను, షినగం దాము ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరేచోట ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీలో ప్రభుత్వం కేటాయించిన పట్టాస్థలంలో కాకుండా వేరొక స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణంపై స్థానిక మహిళ కంటుబోతు సత్యవతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో స్థానిక తహశీల్దారు కె ఆనందరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నెంబరు 60 /1లో లేఅవుట్‌లో సురాల దుర్గాభవానికి 54 ప్లాట్‌ను, ఆ స్థలంలో కాకుండా వేరొక చోట ఇంటి నిర్మాణం చేపట్టిందని ఫిర్యాదులోపేర్కొంది. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

15 రోజుల్లో 'ఉపాధి' వేతనాలు చెల్లించాలి

జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు

ప్రజాశక్తి -తగరపువలస : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని నిబంధనల మేరకు పనిచేసిన కూలీలందరికీ 15 రోజుల్లోగా వేతనాలు ఇవ్వాలని జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భీమిలి మండలం రేఖవానిపాలెం, మూలకుద్దు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనిప్రదేశంలో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు, ఇతర సౌకర్యాల లేమి, వేతనాల చెల్లింపులో జాప్యంపై పలువురు కూలీలు సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, ఉపాధి చట్టం కింద జాబ్‌కార్డున్న కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పాటు పని కల్పించాలని, ఎంతో మంది పని చేయడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వారందరికీ జాబ్

భీమిలిలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలతో గంగారావు

కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు కోత పెట్టి, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ, చట్టంలోని నిబంధనల మేరకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలతోపాటు కూలీలకు వేసవి అలవెన్స్, ఉచిత పనిముట్లు మునుపటిలా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జోన్ కార్యదర్శి కె నాగరాణి, నాయకులు ఎస్ గున్న పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆనందపురం : మామిడిలోవ జాతీయ రహదారి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అందిన సమాచారంతో ఇన్‌ఛార్జి విఆర్‌ఒ మల్లు దొర అక్కడకు చేరుకుని, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి యాచకుడుగా గుర్తించారు. ప్రమాదంలో శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆనందపురం సిఐ. సిహెచ్ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-రోలుగుంట:25 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తూ నలుగురు నిందితులు పట్టుబడ్డారని కొత్తకోట సిఐ జి.కోటేశ్వరరావు తెలిపారు. రోలుగుంట మండలం దిబ్బలపాలెం గ్రామానికి చెందిన చవ్వాకుల చిన్నమ్ములు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి తన ఇంటి వద్ద నిల్వ చేసి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయి తాగేవారికి అమ్ముతూ ఉంటుంటాడన్నారు. జే.నాయుడుపాలెం గ్రామానికి చెందిన వడ్డాది సాయి, బంగారు పవన్‌ల సహాయంతో మద్దిగరవు ప్రాంతానికి వెళ్లి పెదబయలు మండలం తగ్గుపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 25 కేజీల గంజాయిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతానికి ద్విచక్ర వాహనాలపై తీసుకుని వస్తుండగా కొంతలం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులపై కక్ష సాధింపు

ప్రజాశక్తి -గాజువాక : నెలసరి వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించక స్టీల్‌ప్లాంట్‌ఉద్యోగులు, కార్మికులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఐఎన్‌టియుసి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో యూనియన్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డిని అతని నివాసంలో కలిసి సమస్యలను విన్నవించారు. పర్మినెంట్ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, హెచ్‌ఆర్ఎ వంటి ఇతర అలవెన్సులు నిలుపుదల చేశారన్నారు. దీంతో సకాలంలో వేతనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు అందక కార్మికుల కుటుంబాలు, ముఖ్యంగా యువ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదనపు ఆర్థిక ప్రయోజనాలు కల్పించకపోగా, రెయింబవళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించలేదన్నారు. 1200మంది ఉక్కు కార్మికులను విఆర్ఎస్ ద్వారా ఇంటికి సాగనంపారని, రెండు వేలమందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా విధుల్లోంచి తొలగించారన్నారు. మరో రెండు వేల మందిని పైగా తొలగిస్తామని ఆర్ఎల్‌సి లేబర్ కమిషన్ ముందే యాజమాన్యం చెప్పడం దారుణమన్నారు. సంజీవరెడ్డిని కలిసిన వారిలో నీరుకొండ రామచంద్రరావు, ఇతర యూనియన్ నేతలు ఉన్నారు.

సర్కారు బడుల్లో పిల్లలను చదివించండి

పలు గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుల విస్తృత ప్రచారం

పెందుర్తిలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పెందుర్తి : 'మన ఊరిలో ప్రభుత్వ బడి ఉండగా ప్రైవేట్ స్కూల్ దండగ' నినాదంతో సోమవారం మండలంలోని నరవ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కప్పల ప్రసాద్, జనసేన నాయకులు గళ్ళ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ ఆలోచించి ఊరిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గంతకోరు శివకుమార్, మాజీ ఎంపిటిసి ఎల్లపు శ్రీనివాసరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జెర్రిపోతుల నాగేంద్ర, బుదిరెడ్డి శివ, బాలు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

60మంది విద్యార్థులు కొత్తగా చేరిక

ఆనందపురం : తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ పట్నాయక్ అన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్లో విద్యార్థుల చేరికలపై కార్యక్రమం నిర్వహించారు. ఆరు, ఎనిమిదవ తరగతుల్లో 60 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో స్థానిక నేత చందక సూరిబాబు, స్వచ్ఛంద సేవకులు కొట్యాడ సత్యమూర్తి, ఎంపిటిసిలు రమాదేవి, బంటుమిల్లి అప్పలస్వామి ఉపాధ్యాయులు భాస్కరరావు, ముత్యాల నాయుడు, ప్రేమ్‌కుమార్,కెజియా, బంగారం పాల్గొన్నారు

బుచ్చయ్యపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం కేపీ అగ్రహారం, బుచ్చయ్యపేట, ఐతంపూడి, పోలేపల్లి, పి కందిపూడి గ్రామాలలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రధానోపాధ్యాయులు సత్యారావు, ఉపాధ్యాయులు, సిఆర్పి శ్రీను పాల్గొన్నారు.

అనకాపల్లి : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ సోమవారం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ బలరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆనందపురం : తల్లిదండ్రులంతా తమ పిలలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. సోమవారం ఆనందపురం హైస్కూల్లో దీనికి సంబంధించి యుటిఎఫ్ ప్రచురించిన పోస్టర్లను హెచ్ఎం కెఆర్‌కె రామకృష్ణ పట్నాయక్‌తోపాటు యూనియన్ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చందక సూరిబాబు, స్వచ్ఛంద సేవకులు కొట్యాడ సత్యమూర్తి, ఎంపిటిసిలు రమాదేవి, బంటుమిల్లి అప్పలస్వామి, ఉపాధ్యాయులు భాస్కరరావు ముత్యాల నాయుడు,` కజియా, ప్రేమ్ కుమార్, శంకర్రావు, బంగారం పాల్గొన్నారు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

నూకాంబిక జాతర పోస్టర్ ఆవిష్కరణ

జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్థానిక ప్రశాంత్‌నగర్ లో వెలసిన పైడితల్లమ్మ జాతర పోస్టర్‌ను సోమవారం ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గణబాబు గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వచ్చేనెల 4న పుట్టబంగారంతో ప్రారంభమై, 5న నూకాలమ్మ గుడివద్ద, తొలి ఏళ్ల సంబరం, 6న మంగళవారం ప్రధాన పండగ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ఆలయ కమిటీ సభ్యులు గంద్రెడ్డి పెదబాబు, దాడి అప్పారావు, ఆయతంశెట్టి కోటేశ్వరరావు, చందన గాంధీ, పెదబాబు, నరిపిన్ని సత్తిరాజు, చింతల భాస్కరరావు, మూర్తి పట్నాయక్, బుద్ధ శివయ్య, పెతకంశెట్టి శ్యామ్, దాడి రమేష్ నాయుడు, రమేష్, శరత్ చంద్ర, నవీన్, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు పాల్గొన్నారు

అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, వినతి

ప్రజాశక్తి- ములగాడ :జిఒ30 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. అలాగే జిఒలు 296, 388 ప్రకారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లపట్టాలను తక్షణమే రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సోమవారం సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ములగాడ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ భుజంగరావుకు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, జిఒ 30 ప్రకారం ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి వెంటనే పట్టాలివ్వాలని కోరారు. జిఒ 296, 388 ఇళ్ల పట్టాలను రెండేళ్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ప్రకటించిన ప్రభుత్వం గడువు దాటినా రిజిస్ట్రేషన్ చేయించడం లేదని, దీనికి సంబంధించి ఉత్తర్వులు విడుదలలో జాప్యం సరికాదన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకంలో మొదటి సిలెండర్ డబ్బులు చాలామందికి జమ కాలేదన్నారు.సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, విద్యుత్ చార్జీల భారం, ధరలమోత, ఇలా అనేక సమస్యలన ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సిపిఎం నేతలు అందజేసిన వినతిపై తహశీల్దార్ భుజంగరావు స్పందిస్తూ, 2019 అక్టోబర్‌కు ముందు ఇళ్లనిర్మించుకున్న వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హులకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. జిఒ 296 388 పట్టాల రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల డబ్బులపై పౌరసరఫరాల విభాగం అధికారి పద్మ స్పందిస్తూ గ్యాస్ విడిపించిన బిల్లు, రైస్ కార్డు ఇస్తే పరిశీలించి, గ్యాస్ డబ్బులు పడేలా చేస్తామన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో జోన్ నాయకులు ఎన్. శ్రీనివాస రావు పీవీ భాస్కరరావు జి నరేష్ ఎస్.వాసు గంట సత్య నారాయణ పి. రామారావు, బి జగ్గునాయుడు పి ప్రసాద్ ఏ. సత్యారావు కె.పెంటారావు.జి శంకర్, మోహన్, నీలయ్య అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన

కె1, కె2 కాలనీల రోడ్డు సమస్య పరిష్కరించాలి

మధురవాడ : నిండా గోతులమయమై, అధ్వానంగా, అసంపూర్తిగా ఉన్న కె1,కె2 కాలనీల రహదారి సమస్యను పరిష్కరించాలని సిపిఎం విశాఖ జిల్లా నాయకులు డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి రెండవ జోన్ కార్యాలయం వద్ద బైఠాయించి, పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ. మధురవాడ నుంచి ఆయా కాలనీలకు బృహత్తర ప్రణాళిక రహదారి నిర్మాణం చేపట్టినా, జవహర్ నవోదయ విద్యాలయం వద్ద భూవివాదం తలెత్తడంతో అర్ధాంతరంగా నిలుపుదల చేశారన్నారు. అసంపూర్తి రోడ్డును శాశ్వతప్రాతిపదికన పటిష్టం చేయాలని కోరారు. సిపిఎం నేతల వినతిపై జెడ్‌సి స్పందిస్తూ రహదారి సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఆందోళనలో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, ఆయా కాలనీల నాయకులు అవతార్ సింగ్, ఎండి అతిఫ్, బాబా, కె. పద్మ, పి శైలజ, పూర్ణ, ఎస్‌కె. సజనార పాల్గొన్నారు.

అనధికార రుసుము తొలగించాలి

జెడ్‌సికి వినతిపత్రం ఇస్తున్న తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వాసులు

ప్రజాశక్తి -గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌వాసుల నుంచి ఏటా అనధికారికంగా వసూలు చేస్తున్న పెనాల్టీని తక్షణమే రద్దు చేయాలని అపార్ట్‌మెంట్ నాయకులు కోరారు. సోమవారం సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు ఆధ్వర్యంలో జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జివిఎంసి నిబంధనలకు అనుగుణంగానే తమ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్లు నిర్మించుకున్నామని, అయినా ఏటా రూ.3,500 నుంచి రూ.4వేల వరకు ఒక్కో ప్లాట్‌నుంచి అనాథరైజ్డ్ పెనాల్టీ కింద అదనంగా డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. దీనిపై పరిశీలన జరిపి,. తక్షణమే దీనిని రద్దు చేయాలని కోరారు. నతిపత్రం అందజేసిన వారిలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నేతలు జె. రామన్న, శ్రీనివాస్ చౌదరి,తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు హనుమాన్‌నగర్ కొండవాలు ప్రాంతంలో రూ.19.48లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సోమవారం స్థానిక వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణ శ్రీ,సురేష్ శంకుస్థాపన చేశారు. జివిఎంసి ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నందుకు పూర్ణశ్రీ సురేష్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు, ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేసి, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు టిడిపి కార్యదర్శి మిత్తిరెడ్డి శంకర్ టిఎన్‌టియుసి అధ్యక్షులు నక్క లక్ష్మణ్, పూడి భాస్కర్, పొట్నూరి లక్ష్మి, ఆర్‌పి.లక్ష్మి, బిజెపి మండల అధ్యక్షులు రామకృష్ణ, జనసేన నాయకులు యోగేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రిఫరెన్సియల్ ఉపాధ్యాయులకు 24 నుంచి మెడికల్ క్యాంప్‌లు

ప్రజాశక్తి - ఆరిలోవ :ప్రిఫరెన్సియల్ కేటగిరికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు నూతన ఆరోగ్య సర్టిఫికెట్లు పొందేందుకు ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించే ప్రత్యేక మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న విశాఖ జిల్లా ఉపాధ్యాయులు, 25న అనకాపల్లి, 26న అల్లూరి జిల్లా ఉపాధ్యాయులు కెజిహెచ్, ఈఎన్‌టి ఆసుపత్రిల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని కోరారు. ఉపాధ్యాయులు తమ పాత ఆరోగ్య సర్టిఫికేట్లు తప్పనిసరిగా చూపించి, సంబంధిత వైద్యులచే పరిశీలన చేయించుకొని నూతన సర్టిఫికేట్లు పొందవచ్చన్నారు. క్యాంపులో పొందిన సర్టిఫికేట్లు ఆధారంగా మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరి పొందవచ్చన్నారు.

ముగిసిన పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి -పద్మనాభం. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలను సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని, దీనికి అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు సహకరించాలని ఎంఇఒ పి.రమణ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. కార్యక్రమంలో రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె. మణికుమార్. శ్రీనివాసరావు అనిత, ఎపిఎం సాయి రమేష్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ జయ ఉమ పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్వాడీలు, లబ్ధిదారులు

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలి

సిపిఎం కార్పొరేటర్ గంగారావు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నేతలతో గంగారావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును ఆపాలని, ఈసరికే తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకొనే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో 35 ఏళ్లకు పైగా పనిచేస్తున్న2 వేల మంది కాంట్రాక్టు కార్మికులను ఎటువంటి నోటీసు ఇవ్వకుండా, అక్రమంగా తొలగించారన్నారు. మరో 3 వేల మందిని తొలగిస్తామన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పైగా కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తామని చెబుతున్నారని, అక్రమ తొలగింపు ఆపాలని డిమాండ్ చేశారు. వలుధపాల చర్చల్లో ఉక్కు యాజమాన్య చర్యను తప్పుపడుతూ కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించరాదని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేబర్ కమిషనర్ సూచించారని గుర్తు చేశారు. అయితే ఉక్కు యాజమాన్యం తమ పరిధిలో లేదని, కేంద్రంపై నెట్టేస్తోందన్నారు. గతంలో ఒకేరోజు 4200 మందిని తొలగించినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జిల్లా కలెక్టర్‌సమస్యను పరిష్కరించారని, ప్రస్తుతం కలెక్టర్ కలుగజేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘాల నాయకులు నమ్మి రమణ, సూర్యనారాయణ, కె.వంశీకృష్ణ, టి.గురునాథ్, డి.అప్పన్న, ఉరుకూటి అప్పారావు, భాస్కరరావు, సిహెచ్.వెంకటరమణ ఉన్నారు.

మున్నాజీ మాస్టారు సేవలు మరువలేనివి

మున్నాజీ మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నేతలు

ప్రజాశక్తి -గాజువాక : కణితి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం మున్నాజీ మాస్టారు సేవలు మరువరానివని, వైసిపి నాయకులు దామోదర్, దానప్పలు అన్నారు. ఈ నెల 30న ఉద్యోగవిరమణ సందర్భంగా సోమవారం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు అతనికి పుష్పగుచ్చాలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కణితి హైస్కూల్‌లో 12ఏళ్లుగా పిఇటిగా విధులు నిర్వహించిన మున్నాజీ ఎంతో మంది విద్యార్థులను జిల్లా, రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో వందలాది మంది విద్యార్థులను తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్య ప్రకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈనెల 30న మున్నాజీ మాస్టారు ఉద్యోగ విరమణ చేస్తున్నప్పటికీ, ఈ విద్యాసంవత్సరం 23తో ముగుస్తున్న నేపథ్యంలో ముందుగానే సత్కరించారు.

మిగులు భూమికి ఎల్‌పి పట్టాలివ్వాలి

ఆర్‌డిఒను కోరిన తర్లువాడ ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులు

ప్రజాశక్తి- ఆనందపురం : ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన డి.పట్టా భూమికి ఎకరాకు రూ.70లక్షల పరిహారం చెల్లించాలని, అలాగే మిగిలిన డి.పట్టా భూమికి ఎల్‌పి పట్టాలు ఇవ్వాలని నిర్వాసితులు ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్‌కు వివరించారు. సోమవారం తర్లువాడలో సర్వేనెంబర్ 1లో ల్యాండ్ పూలింగ్ కింద సేకరించనున్న 200 ఎకరాలకు పరిహారం చెల్లింపుపై అత్యవసర గ్రామసభ నిర్వహించారు. డి ఫారం పట్టా భూములు ఎకరానికి 42 .50లక్షలు, ఆక్రమణదారులకు రూ.17 లక్షల చొప్పున నష్టపరిహారం అందిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. అయితే డిపట్టా భూములకు ఎకరానికి రూ.70లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. రైతులకు గతంలో రెండు ఎకరాల డిపట్టా భూమి ఇచ్చిన నేపథ్యంలో, ల్యాండ్ పూలింగ్‌లో తీసుకున్న ఎకరా పోను, మిగిలిన ఎకరా భూమికి ఎల్‌పి పట్టాలు మంజూరు చేయాలని రైతులు ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. అలాగే 2002లో డిఆర్‌డిఎ 520 మంది రైతులకు మొక్కలు నాటుకొని ఫల సాయం పొందాలని అందించిన భూమి ఒక్కొక్కరికీ 15 సెంట్లు చొప్పున వస్తుందని, దానికీ పరిహారం చెల్లించాలని కోరారు. స్థానిక సర్పంచ్ బిఆర్‌బి నాయుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో తహశీల్దార్ శ్యాంప్రసాద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న తర్లువాడ నిర్వాసితులు

పిజిఆర్‌ఎస్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్వయంగా పాల్గొని, ప్రజల నుంచి అర్జీను స్వీకరించారు.. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పల్లా వస్తారని పలువురు ఎదురు చూడగా, 12 గంటలకు రావడంతో 15 మంది మాత్రమే వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు అనంతరం వివిధ విభాధికారులతో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఎంఎహెచ్‌ఒ కిరణ్, ఇఇ ఎంఆర్‌ఎఫ్ అప్పారావు, ఎసిపి వెంకటరావు పాల్గొన్నారు..

ఇసుక రీచ్‌ల దారులు ధ్వంసం

ఇసుక రీచ్‌ల దారులను ధ్వంసం చేయిస్తున్న ఎంఆర్‌ఐ శ్యామల

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు స్థానిక తహశీల్దార్ కె. ఆనందరావు ఆదేశాలతో ఎంఆర్‌ఐ శ్యామల సోమవారం ఆ గ్రామంలోని గోస్తనీ నది తీరాన్ని పరిశీలించారు. అక్కడ ఇసుక అక్రమ రీచ్‌ల మార్గాలను గుర్తించి విచారణ జరిపి కృష్ణాపురం నుండి ఇతర మార్గాలకు అనుసంధాన మార్గాలు అన్నింటినీ ప్రొక్లెయినర్లతో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె ఆనందరావు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్, మట్టి, ఇసుక తవ్వకాలు, తరలించే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

హైకోర్టు తీర్పు అమలు చేయాలని
పెట్రో వర్సిటీ నిర్వాసితుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెట్రో వర్సిటీ నిర్వాసితులు

ప్రజాశక్తి-అనకాపల్లి

సబ్బవరం మండలం వంగలి పెట్రో యూనివర్సిటీ భూసేకరణ విషయంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని కోరుతూ వంగలి గ్రామానికి చెందిన నిర్వాసితులు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు మాట్లాడుతూ పెట్రో వర్సటీ భూసేకరణలో వ్యవసాయ కూలీలకు కూడా పునరావాస చట్టం ప్రయోజనాలను పూర్తిస్థాయిలో నాలుగు వారాల్లో అందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. కేవలం పరిహారం ఇచ్చామని చెబితే సరిపోదని, భూసేకరణ చట్టం-2013లో నిర్దేశించిన నిబంధనల మేరకు పునావాసం, నిర్మాణం (ఆర్‌ఆర్ ప్యాకేజీ) అమలు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. డి ఫారం పట్టాలున్న అసైన్డులకు ఎకరాకు రూ.13 లక్షలు, ఇతర పరిహారాలు వడ్డీతో సహా చెల్లించాలని కోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వ గౌరవించి వెంటనే అమలు చేయాలని, లేకుంటే కోర్టు ధిక్కారణ నేరం కింద హైకోర్టును ఆశ్రమిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంటా శ్రీరాం, బాధిత నిర్వాసితులు యర్రా సోంబాబు, గవర రాంబాబు, సుంకర పెదకృష్ణ, ఎ స్వామి నాయుడు, కంద అప్పారావు, యస్ తాతబాబు, సుంకర శివలక్ష్మి, యస్.రాములమ్మ, జట్టి వెంకటేశ్వరరావు, కంద ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి రామారావు, డిపిఒ శిరీష రాణి, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు శచీదేవి, కెఅనంతలక్ష్మి, సరోజినీ, జిల్లా అటవీ శాఖ అధికారి లక్ష్మణరావు, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్‌రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అనకాపల్లి : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, పిడి పరిపాలన అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రొంగలి సూర్యనారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డి గోవిందరావు, వీరు నాయుడు, టీవీ సత్యారావు, అప్పారావు, విజయ, అన్నపూర్ణ, భవాని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడుబాబు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నారని, వారికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.18 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, సెలవులు తదితర సౌకర్యాలకు కల్పించాలన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, బకాయిల జీతాలు చెల్లించాలని కోరారు. తమ సమస్యలపై వినతిపత్రం ఎంపీడీవో సాంబశివరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, కార్మికులు వర్రి వెంకటరావు, నాగరాజు, చిన పైడితల్లి, రామారావు, సముద్రం తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పరవాడ : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ పిఓ వి.లలిత కుమారి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలు సోమవారం పరవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎస్‌వి అంబేద్కర్, ఎంపీడీవో ధర్మారావు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, సర్పంచులు ఎస్.అప్పలనాయుడు, ఎం. సన్యాసినాయుడు, ముత్యాలు, ఎంపిటిసి గొర్లి వరలక్ష్మి, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తురకలపూడిలో గర్భిణీ స్త్రీలకు సీమంతలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎర్రం శెట్టి గోవింద, ఉప సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు, ఎంపీడీవో విజయలక్ష్మి, సిడిపిఓ పుష్ప దేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో సోమవారం ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కూరగాయల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు కూరగాయలను విక్రయించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఏ ఏరియా కోఆర్డినేటర్ ఎం.ఎం.రాజేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, వినియోగదారులకు అవగాహన పెంపొందించేందుకు ఈ విధంగా విక్రయాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సోమవారం మండల పరిషత్తు కార్యాలయం ప్రాంగణంలో ఈ స్టాల్స్ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యాన సోమవారం మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ చోడవరంలో రోజురోజుకీ జనాభా పెరుగుతుందని, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పలు పనులపై అనేకమంది మహిళలు, పురుషులు వస్తుంటారని తెలిపారు. సులభ్ కాంప్లెక్స్‌లు లేకపోవడంతో వీరంతా కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఎటువంటి వసతి లేకపోవడంతో పలు ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చోడవరంలో కనీసం ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి సులభ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమా, సత్యవతి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళలు

సినీ నటులతో ఎమ్మెల్యే కొణతాల తదితరులు

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న సినీ నటులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నూకంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహెూత్సవాల్లో భాగంగా జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో సోమవారం సినీ నటులు పాల్గొన్నారు. చౌర్య పటం మూవీ టీం వేదికపై హల్‌చల్ చేసింది. చిత్ర యూనిట్ హీరో ఇంద్ర, హీరోయిన్ పాయల్, డైరెక్టర్ నిఖిల్, ప్రముఖ నటుడు రాజీవ్ కనకాల, రోల్ రైడ, ప్రముఖ దర్శకులు నక్కిన త్రినాథ్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక దర్శకుడు నక్కిన త్రినాథ్‌కు ఉగాది పురస్కారం అందజేసారు. చిత్ర యూనిట్‌ను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కోలాటం పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలో జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన శ్రీగౌరీ దుర్గ భవాని కోలాట బృందం ప్రథమ స్థానం, పెదగంట్యాడ గుడ్డువానిపాలెం గ్రామానికి చెందిన శ్రీవెంకట సాయిదుర్గా కోలాట బృందం ద్వితీయ స్థానం, అడ్డూరు గంగ భవాని కోలాట బృందం మూడవ స్థానం, కేపీ అగ్రహారం శ్రీనూకంబిక జంట కోలాట బృందం చతుర్ధ స్థానం, సంతపాలెం శ్రీరాధాకష్ణ కోలాట బృందం 5వ స్థానం సాధించాయి. విజేత జట్టుకు వరుసగా రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదు బహుమతులు, మెమెంటోలను ఏపీ రోడ్డు కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు.

26న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈనెల 26వ తేదీన నియోజకవర్గస్థాయి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు అనేక కంపెనీలు వస్తున్నాయని, పదవ తరగతి ఉత్తీర్ణత నుండి డిగ్రీ వరకు ఆపై చదువులు చదివిన వారు 18 నుండి 35 సంవత్సరాల యువతీ యువకులు దీనికి అర్హులని పేర్కొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి : పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై అవగాహనకు సదస్సులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏ.సూర్యకుమారి ఆదేశించారు. అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పౌర సరఫరాలు, వన్ స్టాప్ సెంటర్ పనితీరుపై ఆరా తీశారు. పోస్ చట్టం, షీ బాక్స్ ఏర్పాటుపై సూచనలు చేశారు. బాల్య వివాహాలు అరికట్టడంలో మహిళా పోలీసులు పాత్ర ఎక్కువగా ఉండాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీ పై దృష్టి సారించాలన్నారు. శిశు ఆధార్ కార్డు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ త్వరగా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని జెసి జాహ్నవికి సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, ఐసిడిఎస్ పిడి అనంతలక్ష్మి, నోడల్ అధికారి సుజాత పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయింపు

ప్రజాశక్తి-పరవాడ, దేవరాపల్లి : 2025 -26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం పేద కుటుంబాల విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కేటాయింపు చేసినట్లు పరవాడ ఎంఇఒలు ఎం దివాకరరావు జి సాయి శైలజ, దేవరాపల్లి ఎంఈఓ-1 బి.పడాల్ దాస్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఐసిఎస్ఈ, సిబిఎస్ఇ, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. 25 శాతం సీట్లులో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ /మైనారిటీ/ ఇతరులకు 6 శాతం, అనాథలు, హెచ్ఐవి పీడితులు, వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ.1.20 లక్షల లోపు, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ.1.44 లక్షల లోపు ఆదాయపరిమితి ఉన్నవారు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 28 నుండి మే 25 రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మే 16న విద్యార్థుల అర్హతల నిర్ధారణ, మే 21 లాటరీ ద్వారా మొదటి విడత ఎంపికల జాబితా, జూన్ 2న మొదటి విడత విద్యార్థులు చేరికలు, జూన్ 6న లాటరీ పద్ధతి ద్వారా రెండో విడత ఎంపిక, జూన్ 12న రెండో విడత విద్యార్థుల చేరిక ఉంటాయని తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సందేహాలుంటే ఎంఇఒ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

'పార్టీలకతీతంగా సమస్యలను పరిష్కరిస్తా'

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి సమస్యలు పరిష్కరిస్తానని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెప్పారు. అచ్చుతాపురం మండల కాంప్లెక్స్ సముదాయంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు జన్మదిన వేడుకలు చేశారు. ఇందులో పాల్గొన్న మాడుగుల, యలమంచిలి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్ కుమార్, ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి పరిశీలకులు బొండా జగన్నాథం తదితరులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ చైర్పర్సన్ లాలం భవాని, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు జే నర్సింగ్ రావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదానికి కాలిబూడిదైన పశువుల పాక

పశువుల పాక, గడ్డి దగ్ధం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట,మండలం ఎల్‌బిపి అగ్రహారంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో జక్కాన పైడినాయుడుకు చెందిన పశువుల పాక, వరిగడ్డి కుప్ప దగ్ధమయ్యాయి. జక్కాన పైడినాయుడు పశువులను మేతకు తీసుకువెళ్లగా దాణా ఉడకబెట్టిన నిప్పురవ్వలు పాకపై పడి మంటలు వ్యాపించాయి. ప్రమాద సమయంలో పాకలో పశువులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పశువుల పాకతో పాటు, వరిగడ్డి అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న రావికమతం అగ్నిమాపక దళ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికే మొత్తం ఖాళీ బూడిదైంది. ప్రమాదంలో సుమారు రూ.లక్ష పైబడి ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు పైడినాయుడు తెలిపాడు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు విధుల్లో చేరిన వారి అంకితభావంతో పని చేయాలని ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖకు చెందిన 13 మంది అమరుల పిల్లలకు వివిధ శాఖలలో కారుణ్య నియామకాలు పొందారు. ఇంకా నలుగురికి నియామకాల ప్రక్రియ ద్వారా త్వరలో అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా అమరుల కుటుంబాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆర్థిక, సంక్షేమ ప్రయోజనాలపై సమగ్రంగా చర్చించి, సంబంధిత అంశాలపై జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)కి తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏఓ ఎ.రామ్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.రామకృష్ణారావు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రెబ్స్ యాజమాన్యంతో ఎమ్మెల్యే చర్చలు సఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి : కశింకోట మండలం, బయ్యవరం లో ఉన్న క్రెబ్స్ కంపెనీలో ఉద్యోగుల జీతాలు నిలుపుదల చేయడంపై స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలించాయి. ఉద్యోగులకు జీతాలు నిలుపుదల చేయడం, లే ఆఫ్ ప్రకటించడం విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొణతాల యాజమాన్యంతో చర్చలు జరిపి త్వరలో ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించేలా ఉద్యోగులపై ప్రకటించిన లే ఆఫ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చర్చలు ఒప్పించారు. దీనికి కంపెనీ యాజమాన్యం అంగీకరించింది.

గురుకులంలో ఎటిఎల్ కమ్యూనిటీ డే ఉత్సవాలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో అటల్ ఇంకరింగ్ లాబ్ కమ్యూనిటీ డే ఉత్సవాలను ఎటియల్ ఇంచార్జ్ టి.రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మండలంలోని విద్యార్థులు వివిధ రకాలైన ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎంజె.రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, జె. తిరుపతిరావు, డాక్టర్ కే.కన్నమనాయుడు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌కు కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి -మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు 10 కంప్యూటర్లు, 20 కుర్చీలు, 20 టేబుల్స్‌ను సమకూర్చారు. ఈ మేరకు ఎస్ఎన్ఎఫ్ సీఎండి కుమరే సన్ రాజేంద్రన్ సోమవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అనిత సాహూ, అప్పలనాయుడు, హెచ్ఎం ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, వైస్ చైర్మన్ గిరిజ పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఎస్ఎన్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు మండలంలోని వేచలం జెడ్‌పి హైస్కూల్‌కు ఐదు కంప్యూటర్లు, 10 టేబుల్స్, 10 కుర్చీలు, లేజర్ ప్రింటర్‌ను సోమవారం పాఠశాల హెచ్ఎం దేవపల్లి నరసింహమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అనూజ మిశ్ర, ఈర్లి సన్యాసినాయుడు, స్థానిక సర్పంచ్ శటారి నాయుడు, ఎంపిటిసి శ్రీలక్ష్మి, పూర్వ విద్యార్థులు కె. శ్రీనివాసు, రెడ్డి త్రినాధ్, బత్తి నాయుడు, సత్యారావు, రామారావు, జి.కన్నంనాయుడు, నౌడు అప్పారావు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టాలని ఐద్వా నిరసన

ధర్నా చేస్తున్న మహిళలు, ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ జెఎన్ఎన్‌యుఎంఆర్ కాలనీలో మద్యం, మత్తు పదార్థాల్ని అరికట్టాలని, బెల్ట్ షాపులు ఎత్తివేయాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మహిళలు మీద అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పెట్టి ప్రజల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. గుడికి బడికి తేడా లేకుండా బెల్ట్ షాపులు పెరిగిపోయాయని, తక్షణమే మద్యం బెల్ట్ షాపులు తీసివేయాలని డిమాండ్ చేశారు. కాలనీ నాయకులు ఎం.బంగారమ్మ, అన్నపూర్ణ, లావణ్య, ఆర్ సీతామహాలక్ష్మి, జి లక్ష్మి, శ్రీదేవి, ప్రియాంక, నాగ మాల, శ్రావణి, పి లక్ష్మి, హేమలత, వై వరలక్ష్మి, మంజుల, మణి, జి.లక్ష్మి, ఆర్.కృష్ణవేణి. జి.అరుణ, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా రాంకీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) జన్మించిన అనకాపల్లి ఘోషా ఆసుపత్రిలో సోమవారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పసిపిల్లలకు బేబీ కిట్స్, గర్భిణులకు తాగునీరు కోసం 25 లీటర్ల సామర్థ్యం కల్గిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను అందించారు. ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రిలో ఉన్న పసిపిల్లలకు కూడా బేబీ కిట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్, నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను లక్ష్మీనారాయణ, ఈను, కృష్ణ, అభి, అన్వేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : జనసేన నేత రాంకీ జన్మదిన వేడుకలు కొక్కిరపల్లి ప్రేమ సమాజంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి రాంకీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేమ సమాజానికి నిత్యావసరాలు అందిస్తున్న గొంతిన శ్రీనివాసరావు

ప్రేమ సమాజానికి రెండు నెలలకు సరిపడా నిత్యవసరకులను నిర్వాహకులకు అందచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉగ్గిన రమణమూర్తి, ఉల్లింగల రమేష్, ఎస్.కె బాబర్, నైనం శెట్టి రమణరావు పాల్గొన్నారు. పరవాడపాలెం గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయడు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు బిస్కెట్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అచ్చర్లలో బిస్కెట్, మజ్జిగ అందజేశారు.

పూలే, అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చాలి

అభివాదం చేస్తున్న పలు సంఘాలు, పార్టీల నాయకులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడి, జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేం విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఆతవ ఉదయ్ భాస్కర్ అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద సోమవారం అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జయంతోత్సవాలు నిర్వహించారు. పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రస్థాయి అంబేద్కర్ సేవా రత్న అవార్డు అందుకున్న కాటపల్లి అప్పారావును పలువురు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజ్, ఎంఈఓ బి.పడాల్ దాస్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రు నాయుడు, జనసేన మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ మాలిబాబు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు డ్రైవ్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, అనుబంధ యాజమాన్యాల పాఠశాలల్లో విద్యార్థుల నమోదులు, తరగతుల ఉన్నతి (ప్రమోషన్)కు మూడు రోజులు పాటు ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, విద్యార్థుల నమోదు ప్రక్రియ శత శాతం పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందాలుగా ఆయా ప్రాంతాల్లో వెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల నుంచి ఒకటో తరగతిలోకి, ఐదవ తరగతి కోర్సు పూర్తయిన వారిని సమీప ప్రభుత్వ, అనుబంధ యజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతికి, అలాగే ఉన్నత పాఠశాలల్లో ఎనిమిది ఉత్తీర్ణులైన వారిని తొమ్మిదో తరగతి లోకి, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్మీడియట్, ప్లస్‌వన్ తరగతులలో చేర్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్బవరం : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థులను నూతనంగా ప్రవేశం చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు స్థానిక ఎంఈఓ-1 ఎస్ లక్ష్మణరావు, ఎంఈఓ -2 ఎంజె రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు యు డైస్ పోర్టల్‌లో అడ్మిషన్లు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

పోలీసు అధికారుల సమస్యలపై ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లాలోని పోలీస్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినతి పత్రంలోని అంశాలను గమనించి, వాటిపై త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు, ఎస్పై శేషగిరిరావు, మహిళా హెడ్ కానిస్టేబుల్ లలిత, జిల్లా కమిటీ సభ్యులు మొహిద్దిన్, అచ్చయ్య, శేషాద్రి,

నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

ఉపాధి హామీ పనులు కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో అర్ధాంతరంగా నిలుపుదల చేసిన ఉపాధి హామీ పనులను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఉపాధి పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం దారుణమన్నారు. జనవరి నుండి పనులు కల్పించాల్సి ఉండగా ఏప్రిల్ నెలలో ఒక వారం మాత్రమే పనులు చేయించి నిలుపుదల చేయడంతో కూలీలకు పనుల్లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు లావేటి పార్వతి, అచ్చిబాబు, లక్ష్మి, వెలగా. మహాలక్ష్మి, వేగి వెంకటనాయుడు, పి.అప్పలనరస, డి.శ్రీను పాల్గొన్నారు.

నేడు బోయమాంబ పండగ మహోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని దిబ్బల గొర్లెవానిపాలెం గ్రామంలో మంగళవారం శ్రీబోయమాంబ అమ్మవారి గ్రామ దేవత పండగ మహోత్సవం జరుగుతున్నట్లు ఆలయ కమిటీ వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుండి అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేస్తామని, రాత్రికి డ్రాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.

విద్యార్థుల స్టడీ టూర్

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది మెయిన్ ఎంపి స్కూల్‌కి చెందిన 5వ తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ టూర్ నిర్వహించారు. హెచ్ఎం టీవీ శేషగిరిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు వడ్డాదిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం, విద్యుత్ సబ్ స్టేషన్, పోస్ట్ ఆఫీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తదితరాలను సందర్శించారు. సదరు కార్యాలయాలు పనిచేసే విధానం, ప్రజలకు అందించే సేవలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డిఎస్‌సి ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ అమల్లో భాగంగా మెగా డిఎస్సీ ప్రకటన విడుదల చేయడంపై టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యువ నేత నారా లోకేష్ విద్యాశాఖను ప్రత్యేక శ్రద్ధతో తీసుకుని ఒక ఛాలెంజ్‌గా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

రామకృష్ణకు రవికుమార్ పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అయ్యన్నపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్, వైసిపి నాయకులు బుదిరెడ్డి రామకృష్ణకు ఇటీవల కాలుకు బలమైన గాయమైన నేపథ్యంలో వైసిపి పెందుర్తి నియోజకవర్గం గండి రవికుమార్ సోమవారం రామకృష్ణ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు సబ్బవరపు నాగభూషణం, తుంపాల శివ, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామకృష్ణతో మాట్లాడుతున్న వైసిపి నేత రవికుమార్

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

- సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి:కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వెంటనే ఉపాధి కూలీల ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ డిమాండ్ చేశారు. మండలంలోని అమలాపురం పంచాయతీలో సోమవారం ఉపాధి కూలీలతో కలిసి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు సకాలంలో పేమెంట్లు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 961 కోట్లు రూపాయలను ఉపాధి కూలీల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు 600 రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భూషణం, రాజు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో కూలీలతో కలిసి ఆందోళన చేపడుతున్న సిపిఎం నాయకులు

అనకాపల్లి డెస్క్:ఎస్.రాయవరం మండల కేంద్రంలో గుడివాడలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ ఉపాధి కూలీలని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసిన నిధులను వెంటనే ఉపాధి కూలీలు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 14 వారాల నుంచి పేమెంట్లు చేయక పోవడంతో ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 15 రోజుల్లో పేమెంట్ చెల్లించకపోతే వడ్డీతో కూడిన డబ్బులు ఇవ్వాలన్నారు. 14 వారాలు పేమెంట్ తో పాటు వడ్డీ కూడా వేయాలన్నారు ఈ కార్యక్రమంలో మేకల రమణ మాధురి కుమారి దేవి కూలీలు పాల్గొన్నారు.

యలమంచిలి:మండలంలోని రేగుపాలెం ఉపాధిహామీ కూలీలకు బకాయి పడ్డ 10 వారాలు కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం కూలీలు పని ప్రదేశంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, నాయకులు ఆర్.రాంబాబు మాట్లాడుతూ ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు 10 వారాలుగా కూలి సొమ్ము చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మజ్జిక, మంచినీరు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

యలమంచిలిలో మాట్లాడుతున్న నాయకులు



వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

రాజయ్యపేట గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌కు తొట్టె ఏర్పాటు చేయాలని వార్డు మెంబర్ మైలపల్లి మహేష్ బాబు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో చెత్తను సేకరించి బయటకు తరలించేందుకుగాను పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు అయిందని, తొట్టు లేకపోవడంతో చెత్తను తరలించేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. పంచాయతీకి ట్రాక్టర్ వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ, తొట్టె లేనందున, ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు స్పందించి పంచాయతీకి తొట్టె మంజూరు చేసి, ట్రాక్టర్‌ను వాడుకలోకి తీసుకురావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు చేపల సోమేష్, మైలపల్లి నరేష్, చొక్కా కాశీ, కోడా కాశీరావు, వాసపల్లి శ్రీను, గోసల అప్పలరాజు, దైలపల్లి వీర్రాజు ,రాజారావు , బైరాగి రాజు తదితరులు ఉన్నారు.

బెల్లం పులుపును పారబోస్తున్న పోలీసులు

సారా శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో మేడివాడ శివారు జీడి తోటల్లో నాటు సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మాడుగుల ఎక్సైజ్ సీఐ ఎల్.ఉపేంద్ర, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాటు సారా తయారీ స్థావరాలపై దాడి చేశారు. 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 1500 లీటర్ల బెల్లం పులుపు ఊటలను ధ్వంసం చేసినట్లు సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ఈ కేసులో రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన గేడి చిన్నాలు, గేడి రమణలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను రిమాండ్కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ కే.రామకృష్ణ, గురునాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలో ఆక్రమణలకు గురవుతున్న పలు రోడ్లను పరిరక్షిం చాలంటూ మండల కేంద్రానికి చెందిన గంజి వెంకట రమణమూర్తి సోమవారం మండల పరిషత్తు ఏవో స్వామికి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తుడు

ఈ సందర్భంగా వెంకట రమణమూర్తి మాట్లా డుతూ, ఈ మధ్య కాలంలో రోడ్డుకిరు వైపులా ప్రభుత్వం డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. రావికమతం మెయిన్ రోడ్డు , డ్రైన్స్ మార్జిన్ వదలకుండా గ్రామానికి చెందిన వ్యాపారస్తులు పలువురు రోడ్డుపైకి వచ్చి ఆక్రమిస్తున్నారని తెలిపారు. దీంతో, రోడ్డుపై బైకులు పెట్టుకోవడానికి, నడిచి వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోతుందని తెలిపారు. మండల కేంద్రానికి పలు రకాల పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

భూముల సర్వేను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని జానకయ్యపేటలో పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో చేపడుతున్న రెండవ ఫేజ్ భూసేకరణ సర్వేను నిలుపుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం తహసిల్దార్ నరసింహమూర్తి కు వినతిపత్రం అందజేశారు. సిహెచ్ లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో జానకయ్యపేటలో 192 ఎకరాల జిరాయితీ భూమి పరిశ్రమల స్థాపనకు భూ సేకరణ చేపట్టేందుకు మార్చి నెలలో అధికారులు గ్రామసభ నిర్వహించగా, తామంతా ముక్తకంఠంతో భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికే హెటిరో డ్రగ్స్ కాలుష్యం కారణంగా గ్రామంలో అనేకమంది అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే సమస్య మరింత జఠిలమవుతుందని, గ్రామంలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపన కోసం భూములు ఇచ్చేది

వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

లేదని, వెంటనే సర్వేను నిలుపుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు కురందాసు సింహాచలం, కురందాసు అప్పలరాజు, దేవర సత్తిబాబు, మామిడి బాబ్జి, పంపనబోయిన తులసీరావు, కురందాసు నాగరాజు, దేవర రామకష్ణ, కరక నానాజీ, దేవకు బాబ్జి, చందక శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-రావికమతం: మరుపాక ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే సత్య సునీల్ మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశంకు 322 మంది విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు 303 మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రోస్టర్ పద్ధతిని అనుసరించి ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో సమాచారం అందజేస్తామని, నోటీసు బోర్డులో పేర్లను ఉంచుతామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు కూల్చాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయితీ కేంద్రంలో వారపు సంత జరిగే ప్రభుత్వం స్థలంలో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు వెంటనే నిలుపుదల చేసి కూల్చాలని సిపిఎం నేతలు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ, సంత జరుగు స్థలంలో పంచాయితీ,అనుమతులు లేకుండా బినామీ పేరుతో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను కూల్చాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యా బోధన

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన విద్యార్థులకు అందిస్తున్నామని, పిల్లలను సర్కార్ స్కూల్లో చేర్పించాలని ఎంఈఓలు కే నరేష్, వేమగిరి నూకరాజు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు సోమవారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దలతో సమావేశమై విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల్లో కల్పిస్తున్న నాణ్యమైన విద్య బోధన, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు.

కోటవురట్ల:ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని కొడవటిపూడి పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం శివారు గ్రామాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. విశాలమైన ఆట స్థలం, పోషక విలువలతో కూడిన ఆహారం వంటి సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల ప్రతాప్ కుమార్, విజయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల, నక్కపల్లిలో ప్రచారం చేపడుతున్న ఉపాధ్యాయులు

ప్రారంభిస్తున్న టిడిపి టౌన్ అధ్యక్షులు రంజిత్ వర్మ

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- మాడుగుల:మండల కేంద్రమైన మాడుగుల నూకాలమ్మ కొలని శివారు బంగారు బంద చెరువులో సోమవారం మాడుగుల టిడిపి పట్టణ అధ్యక్షులు రంజిత్ వర్మ చేతుల మీదగా ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్, మరువాడ ఈశ్వరరావు, వీఆర్పీ పాపయమ్మ, కూలీలు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం సవరణపై ముస్లిముల ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వక్ఫ్ బోర్డు చట్టం 2025 సవరణకు వ్యతిరేకంగా సోమవారం నర్సీపట్నంలో ముస్లింలు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ నర్సీపట్నం జామియా మసీదు నుంచి ప్రారంభమై శ్రీకన్య కూడలి వరకు సాగింది. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఆర్డీవో వివి.రమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇటీవల వక్ఫ్ 2025 సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి దానిని చట్టంగా రూపొందించిందన్నారు. ఈ సవరణ ముస్లింల సంక్షేమ కార్యకలాపాలకు ఇచ్చిన ఆస్తులను కబళించే విధంగా ఉందన్నారు. ఇస్లాం ధర్మం నియమాల ప్రకారం ఒక సారి సంక్షేమ కార్యక్రమాలకు దానం చేసిన ఆస్తిని ఇతర కార్యాకలాపాలకు వాడకూడదన్నారు. ఈ చట్ట సవరణ విషయంలో విద్యావేత్తలు, మేధావుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోలేదని చెప్పారు. దీనితో పాటు సంయుక్త పార్లమెంటరీ సంఘం అభిప్రాయాలు, అభ్యంతరాలను కూడా పరిగణనలోనికి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఉభయ సభలలో ఆమోదించిందన్నారు. ఈ చట్ట సవరణతో వక్ఫ్ ఆస్తులకు పెద్ద విఘాతం కలుగుతుందన్నారు. ముస్లిం సమాజం సంక్షేమం, అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం ఈ చర్యను ముస్లిం పర్సనల్ లా బోర్డు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికైనా ఈ సవరణ చట్టం అమలు కాకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ముస్లిములు

ఉపాధి హామీ కూలీలకు అందని వేతనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా గడిచిన 12 వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు, మండలంలో 25 గ్రామ పంచాయతీలలోను 5400 మంది వరకు ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. వీరికి సుమారు కోటి రూపాయల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది, గ్రామీణ ప్రాంత ప్రజలకు వేసవిలో పనులు దొరకని సమయంలో ఎంతో కొంత అండగా ఉంటుందన్న ఉద్దేశంతో ఉపాధి పనులకు వెళ్తున్న వారికి సకాలంలో వేతనాలు అందకపోవడం పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏపీఓ నాగరాజు మాట్లాడుతూ సుమారు 12 వారాలుగా వేతనాలు చెల్లించాల్సి ఉందని సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని తెలిపారు, చెల్లించాల్సిన వేతనాలను అప్లోడ్ చేశామని నిధులు విడుదల కావలసి ఉందన్నారు.

25శాతం ఉచిత సీట్లు కేటాయించాలి

ప్రయివేటు విద్యా సంస్థల అధిపతులతో విద్యాశాఖ ఆర్‌జెడి

ప్రజాశక్తి - విశాఖపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు 12(1)సి ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం 25 శాతం ఉచిత సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని రాష్ట్ర విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ తెలిపారు. సోమవారం విశాఖలోని రుషికొండ వాడపాలెం పాఠశాలలో ప్రయివేటు మేనేజ్‌మెంట్ పాఠశాలలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్‌తో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఒకటో తరగతిలో చేరే పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయింపులు చేయాలన్నారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ లోపు వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, చేయని వారిపై క్రమశిక్షణా చర్యలు ప్రభుత్వం వైపు నుంచి ఉంటాయని హెచ్చరించారు. ఈనెల 26 నుంచి మే 15వ తేదీ లోపు ప్రభుత్వం విద్యార్థులను పాఠశాలలకు కేటాయించుటకు వీలుగా విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ సచివాలయ పరిధిలో వారు రిజిస్ట్రేషన్ తీసుకోవాలని కేవలం 1వ తరగతిలో మాత్రమే ఇలా అడ్మిషన్లు ఉండాలని చెప్పారు. 5 సంవత్సరాలున్న విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో చినగదిలి మండల ఎంఇఒ-1 రవీంద్రబాబు, ఎంఇఒ -2 అనురాధ, సిఆర్‌పిలు, ఎంఐఎస్, డేటా ఎంట్రీ, అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

వెటర్నరీ కాలనీలో స్థల వివాదం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్, డాక్టర్స్ కాలనీలో ఒక స్థలం విషయమై వివాదం చోటు చేసుకుంది. అది పశుసంవర్ధక శాఖకు చెందిన మిగులు స్థలం అని పశు సంవర్ధక శాఖ అధికారులు, ఆ స్థలం తమదే అంటూ మరికొంత మంది ప్రయివేటు వ్యక్తుల మధ్య సోమవారం వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు వచ్చి జోక్యం చేసుకోవడంతో వాగ్వివాదం సద్దుమణిగింది. వివరాలివి. విశాలాక్షినగర్ వెటర్నరీ కాలనీని ఆనుకొని సర్వే నెంబరు 134/1లో సుమారు 44 సెంట్ల స్థలం గతంలో ప్రభుత్వం బారికి మాన్యం కింద కేటాయించిందని సోమవారం కొంతమంది వ్యక్తులు ఆస్థలం తమదే అంటూ జెసిబితో చదును చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీలయ్య ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు డాక్టర్ అశోక్, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ సతీష్, సిబ్బంది అక్కడకు వచ్చారు. ఇది సర్వే నెంబరు 133/8లో పశు సంవర్ధక శాఖకు చెందిన మిగులు భూమి అని పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీనితో ఇరువురు మధ్య కొంత సేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. పశు సంవర్ధక శాఖఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ ఎస్ఐ కృష్ణ ఇరువురిని సముదాయించి, స్థలానికి సంబంధించిన దస్త్రాలు తీసుకు రావాలని ఇరువురికి చెప్పడంతో వాగ్వివాదం సద్దుమనిగింది. ఇరువురి డాక్యుమెంట్లు రెవెన్యూ అధికారుల పరిశీలనకు నివేదిస్తామని ఎస్ఐ తెలిపారు. అప్పటివరకు స్థలంలో ఎవరూ ఎటువంటి పనులు చేపట్టకూడదని హెచ్చరించారు.

అమెరికా ఉపాధ్యక్షుడు పర్యటనపై నిరసన

అచ్యుతాపురం, నక్కపల్లిలో నిరసన చేపడుతున్న ఏపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి:అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత పర్యటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏపీ రైతు సంఘం అ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు అన్నారు. మండలంలోని చందనాడ పంచాయితీ తమ్మయ్యపేటలో పాడి రైతులు, గ్రామస్తులతో కలిసి సోమవారం జెడి వాన్స్ భారత పర్యటనకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు భారత ప్రధాని మోడీ తలొగ్గి అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు భారతదేశంలో దిగుమతి సుంకాలను తగ్గించాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారన్నారు. మార్కెట్ పరిమితులు తొలగిస్తే భారతదేశానికి అమెరికా పాడి ఉత్పత్తులు దిగుమతి భారీగా పెరుగుతాయని, దీంతో భారత దేశంలో పాడి పరిశ్రమ కుదేలవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్, రైతులు సుబ్బారావు, సత్తిబాబు, గురునాథ్, పద్మ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వ్యాన్స్ భారత పర్యటనను నిరసిస్తూ ఏపి రైతు సంఘం ఆధ్వర్యాన మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం నిరసన తెలిపారు. వ్యాన్స్ గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో వ్యవసాయం, పాడి, మత్స్య రంగాలలో అసమాన ఒప్పందాలు వద్దు అంటూ నినదించారు. ఈ సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు చెరగడం రాము నాయుడు, కర్రి నాగేశ్వరరావు, ఆడారి కనక అప్పారావు, ఎస్ శివ బాపు నాయుడు, ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని తాటి పర్తి యూనిట్ కాశీపురం గ్రామంలో విత్తనాలను రైతులతో తయారు చేయించడం జరిగిందని ప్రకృతి వ్యవసాయ మండల సూపర్‌వైజర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలకరి వర్షాలకు ముందుగా పీఎండీఎస్ విత్తనాలు ఎకరాకు 12 కేజీల చొప్పున పొలంలో వేసుకోవాలని తెలిపారు. తద్వారా ప్రధాన పంటకు కావలసిన సూక్ష్మస్థూల పోషకాలు అందుబాటులోకి తీసుకువచ్చి మొక్కల వేరు వ్యవస్థ గ్రహించేటట్టు చేస్తాయన్నారు. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చి మేతగా ఉపయోగపడతాయని ,నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఏ నాగమణి డివిజన్ ఇంచార్జ్ నాయుడు బాబు, ఎంటి దేవి విఏఏలు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్సి నోటిఫికేషన్‌లో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు అన్నారు. ఆదివారం అరకులోయ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ,తక్షణమే ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల గిరిజన నిరుద్యోగులతో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 3 రద్దు చేయడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

పోర్టులో బయోమెట్రిక్

-సకాలంలో రాకపోతే ఆర్థిక కోతల విధానం
-ఆదేశాలు జారీచేసిన పోర్టు కార్యదర్శి వేణుగోపాల్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిఎ)లో ఉద్యోగులు, కొన్ని శాఖల అధికారులకు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ సోమవారం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసే చర్యలపై కింది స్థాయి పర్యవేక్షణాధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు వచ్చే ఉద్యోగులు, 10.30గంటల తర్వాత వచ్చే వారికి సంబంధించిన వివరాలను తన టేబుల్‌పై ప్రతిరోజూ ఉండాలని ఆదేశించారు. పోర్టు మెయిన్ కార్యాలయం జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (జిఎడి)లో హాజరుపట్టీ సక్రమంగా అమలయ్యేలా చూడాలంటూ మౌఖిక ఉత్తర్వులను జారీచేశారు. పలువురు ఉద్యోగులు, కొద్దిమంది హెచ్ఒడిలు సమయానికి విధులకు రావడం లేదన్న సమాచారంతో సెక్రటరీ వేణుగోపాల్ ఈ చర్యల దిశగా అడుగులు వేస్తున్నారు. ఎవరేమనుకున్నా తాను పట్టించుకోనని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే పోర్టు కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఈ సందర్భంగా వారితో తెలిపారు. పోర్టులో తొలుత తన పరిధిలో ఉండే ఉద్యోగులకు బయోమెట్రిక్ (హాజరు) విధానం అమలు చేస్తే తర్వాత యావత్ పోర్టులో అమలు చేసేందుకు వీలుంటుందని వెల్లడించారు. ఇంతవరకూ ఉద్యోగులు, అధికారుల హాజరు వివరాలను తనకు నెలల తరబడి ఇవ్వని దిగువ శ్రేణి ఉద్యోగులను ఆయన ఈ సందర్భంగా మందలించారు. ప్రతిరోజూ బయోమెట్రిక్ హాజరు వివరాలు తనకు తెలియాలని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లోని సెక్షన్ అధికారులకు అప్పగించారు.

జేఈఈలో 'శ్రీ రామానుజ' అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని శ్రీ రామానుజ జూనియర్ కాలేజీ ఆధ్వర్యాన నడుస్తున్న శ్రీ రామానుజ ఐఐటి, ఎన్ఈఈటి అకాడమీ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపల్ పేరు శివరామ దత్తాత్రేయ తెలిపారు. 2022 నుంచి 113 మంది ఎంపిసి విద్యార్థులలో 18 మంది ప్రఖ్యాత ఐఐటి - జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు సాధించారని తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో సంస్థ విద్యార్థులు వరుసగా 99.493, 98.709, 98.619, 96.660, 96.454, 95.421, సబ్జెక్టులవారీగా భౌతిక శాస్త్రం – 99.738, రసాయనశాస్త్రం 99.717, గణిత శాస్త్రం – 98.515 శాతంతో ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. బయాలజీ స్ట్రీమ్‌లో 18 మందిలో 11 మంది ఎంబిబిఎస్, బిఎఎంఎస్, బిడిఎస్ సీట్లు పొందారని వివరించారు. ఎన్ఈఈటి భౌతిక శాస్త్రంలో గరిష్ట స్కోరు 175/180 వచ్చినట్లు తెలిపారు. శ్రీ రామానుజ అకాడమీలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత దృష్టి పెడతారని పేర్కొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న అకాడమీ ప్రతినిధి